నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | ఖమ్మం, శనివారం 9 మే 2026 | SURYAPET

రాష్ట్రంలో రాక్షస పాలన

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్, మే 8: బీఆర్‌ఎస్ నేతలపై అధికార కాంగ్రెస్ భౌతిక దాడులకు దిగడం సిగ్గుచేటని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై ప్రజా సంఘాలు, సోషల్ మీడియా, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై భౌతిక దాడులు చేస్తున్నాయని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ సభతో కాంగ్రెస్, బీజేపీలకు భయం పట్టుకుందన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై భౌతిక దాడి వెనుక బీజేపీ నేత బండి సంజయ్, కాంగ్రెస్ నాయకుల కుట్ర ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మోదీ నేతృత్వంలోనే పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎన్ని దాడులు చేసినా ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ డ్రామాలు చేస్తోందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు పరిపాలన అందించడంలో రాష్టంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఎక్కడి ధాన్యం అక్కడే..

కేసీఆర్ పాలనలో వడ్లు అమ్ముకొని బంగారం కొంటే..

రేవంత్‌రెడ్డి పాలనలో బంగారం అమ్మి ఎవుసం చేసే దుస్థితి

- నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు
- ఐకేపీ కేంద్రాల్లో, జాతీయ రహదారిపై ధాన్యం రాసులు
- ఐకేపీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు
- హమాలీలు, బస్తాలు, లారీల కొరత

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఓటుకు వెయ్యి రూపాయలు ఇచ్చారు. డబ్బుకు ఆశపడి కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాం. ఒక్కరోజు రూ.వెయ్యి తీసుకొని కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి రెండున్నర ఏండ్లుగా ఇబ్బంది పడుతున్నాం. రైతుబంధు సక్రమంగా ఇవ్వడం లేదు. రుణమాఫీ చేయడం లేదు. యూరియా కొరత. ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అష్టకష్టాలపాలవుతోంది. కేసీఆర్ పాలనలో రైతులకు ఏ బాదరాబందీ ఉండేది కాదు. సీజన్ ప్రారంభంలోనే రైతుబంధు పడేది. యూరియా, అడుగుమందుకు ఏ ఇబ్బందీ పడలేదు. దుకాణాదారుకు ఫోన్ చేస్తే యూరియా బస్తాలు ఇంటికి వచ్చేవి. ఐకేపీ కేంద్రాల్లో వెనువెంటనే ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం అమ్మిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు లుపడేవి.


ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం


జాతీయ రహదారిపై పోసిన ధాన్యం

హాలియా, మే 8: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు నత్తనడకసాగుతోంది. గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో ఎక్కడి ధాన్యం నిల్వలు అక్కడే పేరుకుపోయాయి. యాసంగి కొనుగోళ్లు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా నేటికీ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి సగం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఐకేపీ కేంద్రంలో పోసి 15 రోజులు దాటినా ధాన్యం కొనుగోలు చేసే నాథుడే కరువయ్యాడు.

కనీస సౌకర్యాలేవీ?

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఐకేపీ కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐకేపీ కేంద్రాల్లో టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చాక ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు రైతులకు కనీస మంచినీరు, టెంటు సౌకర్యం కల్పించడం లేదు. 44 డిగ్రీల ఎండలో ధాన్యాన్ని తూర్పారబట్టి శుద్ధి చేసినప్పటికీ కొనుగోలు చేసేందుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఐకేపీ కేంద్రాల్లో గోనె సంచులు, హమాలీలు, లారీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. దీనికి తోడు ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు బస్తా 40 కేజీలకు బదులు 42 కేజీల తూకం వేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు.

మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

దేశానికి రైతు వెన్నెముక, రైతు లేనిదే రాజ్యం లేదు. ఎద్దు ఏడ్చిన అవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన దాఖలాలు లేవన్నది చరిత్ర చెప్పిన సత్యం. రైతు సంక్షేమాన్ని విస్మరిస్తే జరిగే పరిణామాలను చరిత్ర ఎంతో స్పష్టంగా చెప్పినా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రం కనువిప్పు కల్గడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల రైతుబంధు ఇస్తే.. అధికారంలోనికి వచ్చిన వెంటనే ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చి నేడు మాట తప్పారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీకి రాంరాం చెప్పారు. దళారులు, మిల్లర్లతో కుమ్మక్కైన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసేందుకు కొర్రీలు పెడుతోంది.

సగం ధాన్యం ఐకేపీ కేంద్రాల్లోనే..

అనుముల మండలంలో సగం ధాన్యం ఐకేపీ కేంద్రాల్లోనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 15 గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 20 రోజులుగా ప్రభుత్వం మండలంలోని 852 మంది రైతుల వద్ద నుంచి 74,711 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. మండలంలోని ఆయా ఐకేపీ కేంద్రాల్లో 62,400 బస్తాలకు పైగా ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉంది. ఒక్క అనుముల మండలంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే మిగిలిన ఐదు మండలాల్లో సుమారు 4 లక్షల బస్తాల ధాన్యం ఐకేపీ కేంద్రాల్లో మూలుగుతోంది. అకాల వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన జిల్లా యంత్రాంగం స్పందించి ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేసి న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తోంది.

ప్రభుత్వం విఫలం



ధాన్యం కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దళారులు, మిల్లర్లు కలిసి రైతులను తరుగు పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లించడం లేదు. మంత్రి, ఎమ్మెల్యేలు మిల్లర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి రైతులను మోసం చేస్తున్నారు. దళారులు, మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలి. రైతులకు కనీస మద్దతు ధర చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోలు చేయాలి. మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలి.


–నోముల భగత్‌కుమార్. మాజీ ఎమ్మెల్యే

నత్తకడన..



అనుముల మండలంలో ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతోంది. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం పోసి 15 రోజులైనా కొనుగోలు చేసే దిక్కులేదు. బస్తాలు, లారీల కొరత తీవ్రంగా ఉంది. నిర్వాహకులు, మిల్లర్లు ఏకమై తాలు పేరుతో బస్తాకు 2 కేజీలు అదనంగా తీసుకుంటూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

–అనుముల శంకర్, ఇబ్రహింపేట


మొదట జారీ చేసిన ట్రక్‌షీట్


రెండోసారి జారీ చేసిన ట్రక్‌షీట్

ఒకే లారీకి రెండు ట్రక్ షీట్లు

- మిల్లర్ల మాయాజాలానికి రైతులు బలి
- రామారంలో అట్ల మల్లారెడ్డి పేరిట 569 బస్తాలతో మొదట ట్రక్ షీట్
- అదే లారీకి అతడి పేరిటే 555 బస్తాలతో రెండోసారి ట్రక్ షీట్
- 14 బస్తాల తరుగు తీసిన నిర్వాహకులు, మిల్లర్లు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకుపోతున్నాయి. గోనె సంచుల కొరత ఉందని కొర్రీలు పెడుతున్నారు. ఆలస్యంగా కాంటా చేస్తున్నారు. ఒక లారీ లోడ్‌కు 10 నుంచి 15 బస్తాలు కోత పెడుతూ రైతులను నిలువునా ముంచుతున్నారు. ప్రభుత్వం తమను బలవంతంగా ధాన్యం కొనుగోలు చేయిస్తోందని మిల్లర్లు బహిరంగంగానే చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్ల మధ్యలో రైతులు నిండా మునుగుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ట్రక్ షీట్ రాసిన లారీలకు తిరిగి రెండోసారి ట్రక్ షీట్ జారీ చేయకుండా... ధాన్యం తూకంలో కోతలు పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

గుండాల, మే 8: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు విలువ లేకుండా పోతోంది. మోత్కూర్‌కు చెందిన శ్రీరామకృష్ణ రైస్‌మిల్ యజమాని ధాన్యంలో నాణ్యత లేదంటూ బాహటంగానే కోతలు పెడుతూ రైతులను నిండా ముంచుతున్నారు. మండలంలోని రామారంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో గత నెల 30న రైతు అట్ల మల్లారెడ్డికి చెందిన ధాన్యాన్ని తూకం వేసిన అనంతరం సెంటర్ ఇన్‌చార్జి అంజం అనిత 569 బస్తాలకు ట్రక్ షీట్ రాసిచ్చారు. తన వడ్లను తూకం వేశారని కొంత సంతృప్తి పడేలోగా శ్రీరామకృష్ణ రైస్ మిల్, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి మల్లారెడ్డికి ఫోన్ చేసి దగ్గరకు పిలిపించుకున్నారు. 'నీ ధాన్యం నాణ్యతగా లేదు. 14 బస్తాలు కటింగ్ చేస్తాం' అని చెప్పడంతో మల్లారెడ్డి అవాక్కయ్యాడు. సారూ.. 'మీకు దండం పెడతా.. నేను ఆరుగాలం కష్టం చేసి పండించిన ధాన్యాన్ని కటింగ్ చేయొద్దు' అని వేడుకున్నా.. అదే లారీకి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రెండోసారి మల్లారెడ్డి పేరిట 14 బస్తాలను కోత పెట్టి 555 బస్తాలకు ట్రక్ షీట్ రాసిచ్చారు. రైతు దిక్కుతోచని పరిస్థితుల్లో ఏమీ చేయలేక వెనుదిరిగారు. వ్యవసాయ అధికారులు ధ్రువీకరించిన తర్వాత ధాన్యంలో కోత విధించడం చట్ట విరుద్ధమని తెలిసినా.. మిల్లర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తాము చేసిందే వేదం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇది ఒక్క రామారంలోనే కాకుండా ఇలాంటి ఘటనలు మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయంపై ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి అనితను వివరణ కోరగా సీఈవో నాగయ్య చెప్పినట్లుగానే రెండు ట్రక్ షీట్లు రాసిచ్చానని చెప్పారు. మోత్కూర్ రామకృష్ణ రైస్‌మిల్ యజమాని మాట్లాడుతూ ప్రభుత్వం తమను బలవంతంగా వడ్లను కొనుగోలు చేసేలా వత్తిడి చేస్తోందని తెలిపారు. తప్పనిసరి పరిస్థితులో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ధాన్యంలో కోతలు పెడుతున్నామని చెప్పుకొచ్చారు.

ప్రభుత్వానిదే నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, మే 8: 'పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడులు. ఎరువులు అందడం లేదు. సమయానికి రుణమాఫీ కాలేదు. ఆర్థికంగా కుదేలవుతున్న అన్నదాతలు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది' అని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం రాశులను పరిశీలించిన రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సర్కారులో రైతులు పండించిన చివరి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు. వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో సొమ్ము జమ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ పంటలు కొనుగోలు చేయడం లేదన్నారు. 'రేయింబవళ్లు వర్షాల భయంతో రైతులు భయపడుతున్నారు. అన్నదాతల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయి' అని విమర్శించారు. రైతు కన్నీరు పెట్టుకుంటే ఈ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే వడ్లు కొనుగోలు ప్రారంభించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, మేకల రాజిరెడ్డి, బొక్క భూపాల్ రెడ్డి, దుబ్బాక శ్రీధర్, మేడబోయిన రాంబాబు, నడింపల్లి మహేష్, పుల్లెంల మహేష్, జానీ పాల్గొన్నారు.


నార్కట్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కదలని ధాన్యం

ఆత్మకూరు(ఎం), మే 8: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ఏర్పడటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు, కూరెళ్ల, పుల్లాయిగూడెంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలిచిపోయింది. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో 114 మంది రైతులు ధాన్యం రాసులు పోశారు. కేవలం 20 మంది రైతుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. కూరెళ్లలో 150 మంది రైతులు ధాన్యం రాసులు పోయగా ఇందులోని నుంచి 50 మంది రైతుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. పుల్లాయిగూడెంలో 152 మంది రైతులు ధాన్యం రాసులుగా పోయగా ఇందులో నుంచి 50 మంది రైతుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెనువెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పొద్దున కాంగ్రెసోళ్ల తో.. రాత్రి బీజేపోళ్ల తో రేవంత్ చర్చలు

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, మే 8: 'ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి సీఎం రేవంత్ రెడ్డి పొద్దున కాంగ్రెసోళ్లతో, రాత్రి బీజేపీ వాళ్లతో చర్చలు జరిపి తిరిగి తెలంగాణకు వస్తారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాష్ట్రంలో అప్రజాస్వామిక పద్ధతిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై, మాజీ మంత్రులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలు చేస్తూ నీచమైన సంస్కృతికి తెరలేపుతున్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే దాడులు, దౌర్జన్యాలేనా?, రైతుల ఆత్మహత్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు ప్రశ్నించడం లేదు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు సీఎం కేసీఆర్‌కు పట్టం కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి' అని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వాహనంతో పాటు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల దాడిని ఖండిస్తూ నకిరేకల్‌లోని సువర్ణగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం చిరుమర్తి లింగయ్య విలేకర్లతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీతో కుమ్మక్కై రాష్ట్రానికి రావాల్సిన వాటాను దోచుకొని ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు 16 మంది ఉన్నా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి తీసుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పల్లె విజయ్, కడపర్తి, సర్పంచ్‌లు గొర్ల వీరయ్య, బంటు రవి, మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, ప్రధాన కార్యదర్శి నోముల కేశవరాజు, ఉపాధ్యక్షుడు గుండగోని జంగయ్య, యూత్ అధ్యక్షుడు పేర్ల కృష్ణకాంత్, మాజీ వైస్ ఎంపిపి సామ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకన్న, నాయకులు యానాల లింగారెడ్డి, దైద పరమేశ్, ఎస్‌కె అమీర్‌పాషా, స్టీఫెన్, ఎమ్‌డి అఖిల్, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండా చిరిగినా పట్టించుకునే వారే లేరు. అధికారుల నిర్లక్ష్యానికి ఈ దృశ్యమే ప్రత్యక్ష సాక్ష్యం.

–గుజ్జ నరేశ్, నమస్తే తెలంగాణ యాదాద్రి భువనగిరి ఫొటోగ్రాఫర్

మహిళ దారుణ హత్య

- శ్రీశైలం అడవుల్లో మృతదేహం లభ్యం
- కేసును ఛేదించిన ఆంధ్ర పోలీసులు


నాగలక్ష్మి (ఫైల్)

గరిడేపల్లి, మే 8 : మండలంలో మహిళ హత్య సంచలనం సృష్టించింది. ఆంధ్ర రాష్ట్రంలోని ఎన్‌టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం కోనాయిగూడెం గ్రామానికి చెందిన నాగలక్ష్మిని సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన పొరల్ల గోవిందు అతడి భార్య మహాలక్ష్మి కలిసి హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 24న నాగలక్ష్మి కోనాయిగూడెం నుంచి కోదాడకు వచ్చింది. విషయం తెలుసుకున్న కాల్వపల్లి మాజీ ఎంపీటీసీ మహాలక్ష్మి ఆమె భర్త గోవిందు కోదాడకు వచ్చిన నాగలక్ష్మిని నమ్మించి కారులో ఎక్కించుకొని మిర్యాలగూడ మండలం ఆళ్ళగడప సమీపంలో హత్య చేశారు. ఆమెను కారులో తీసుకెళ్లి శ్రీశైలం అడవుల్లో పడేశారు. ఈనెల 24న బయటకు వెళ్లిన నాగలక్ష్మి ఆచూకీ తెలియకపోవడంతో ఆమె భర్త చందర్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ తర్వాత కాల్వపల్లి మాజీ ఎంపీటీసీ మహాలక్ష్మి భర్త గోవిందుతో డబ్బుల విషయంలో జరుగుతున్న గొడవను పోలీసులకు చెప్పింది. ఆ కోణంలో పోలీసులు విచారణ చేయడంతో అసలు విషయం బయటపడింది. సుమారు 8 ఏండ్లపాటు గోవింద్ ఇంట్లో నాగలక్ష్మి ఆమె భర్త నివాసం ఉంటున్నారు. రెండేండ్ల క్రితం మద్యానికి బానిసై నాగలక్ష్మి భర్త చనిపోయాడు. అనంతరం నాగలక్ష్మి ఎన్‌టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలోని కొనాయపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. కాల్వపల్లిలో గోవిందు ఇంటిలో ఉన్న సమయంలో నాగలక్ష్మికి చెందిన లక్షల రూపాయలను గోవిందు వాడుకున్నాడు. ఇటీవల ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని నాగలక్ష్మి కోరింది. దీంతో ఆమెను వదిలించుకునేందుకు మహాలక్ష్మి భర్త గోవిందుతో కలిసి పథకం ప్రకారం ఈనెల 24న నాగలక్ష్మిని హత్య చేశారు.

ఏసీబీ దాడులు

మిర్యాలగూడ మున్సిపాలిటీలో అవకతవకలు

- వెలుగు చూసిన అక్రమాలు
- పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం
- ప్రభుత్వ ఆదాయానికి భారీనష్టం
- తనిఖీ సమయంలో డీఈ ఎస్కేప్



మిర్యాలగూడ టౌన్, మే 8: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అవినీతి కార్యకలాపాలు, అవకతవకలు జరుగుతున్నాయన్న విస్వనీయ సమాచారంతో నల్లగొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చంద్ర, అతడి బృందం గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించింది. మున్సిపల్ కార్యాలయంలోని రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, కార్యాలయ మొత్తం పనితీరును తనిఖీ చేయడంతో అవకతవకలు జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. 2025-2026లో పన్ను మదింపు రూ.24.86 కోట్లు కాగా కేవలం రూ.9.17 కోట్లు వసూలు కాగా రూ.15.68 కోట్లు బకాయిగా మిగిలిపోయాయి. పన్నుల వసూలులో నిర్లక్ష్యం చేయడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలుగుతోంది. 2025-26లో మిర్యాలగూడ మున్సిపాలిటీలో మొత్తం 1,756 దుకాణాలకు పన్ను మదింపు రూ.43.3 లక్షలు కాగా అందులో రూ.28.35 లక్షలు చెల్లించగా రూ.14.95 లక్షలు బకాయిలు చూపారు. 2026-27లో 1,783 దుకాణాలకు మదింపు రూ.36.18 లక్షలు కాగా కేవలం రూ.15.01 లక్షలు మాత్రమే చెల్లించారు. రూ.21.17లక్షలు బకాయి ఉన్నట్లు గుర్తించారు. తనిఖీలు జరుగుతున్న సమయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బోలుగురి వెంకన్న అధికారిక అనుమతి లేకుండా గైర్హాజరైనట్లు గుర్తించారు. చేయూత పెన్షన్, జనన, మరణ విభాగంలో 116 జనన దరఖాస్తులు, ఒక మరణ దరఖాస్తు 7 రోజుల ప్రాసెసింగ్ గడువు మించిపోయినట్లు గుర్తించారు. పోర్టల్ ఎంట్రీ ఆప్షన్ లేకపోవడంతో 1,820 పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. టౌన్ ప్లానింగ్‌లో భవన నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే రాబడి వసూళ్లు రూ.3.25 కోట్ల (2024-25) నుంచి రూ.3.05 కోట్ల (2025-26)కు పడిపోయాయి. ఇది అధికారుల పేలవమైన పనితీరును సూచిస్తోందని ఏసీబీ గుర్తించింది. 2025-26 సంవత్సరానికి మ్యుటేషన్ దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. 86 దరఖాస్తులలో 61 పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ప్రజా అభ్యర్థనలను సరిగా పరిష్కరించడం లేదని తెలిపారు. 2026-27 సంవత్సరానికి ఆమోదాలలో వ్యత్యాసాలు ఉన్నాయని, 34 ఆమోదించినా కేవలం 18 మాత్రమే అందాయి. రికార్డుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడ్డారని తెలిపారు. భవన అనుమతి, లే అవుట్, ఆక్రమణ మొదలైన రిజిష్టర్లను సరిగా నిర్వహించడం లేదని, మూడు రిజిష్టర్లు మాత్రమే పాక్షికంగా ఉంచారని, వాటిపై అధికారి సంతకాలు లేవని గుర్తించారు. అనేక భవన అనుమతి దరఖాస్తులు 21 రోజుల గడువును మించి పోయాయన్నారు. అనధికార నిర్మాణాలపై వచ్చిన 54 ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు లేకుండా పెండంగ్‌లో ఉన్నాయన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 4,638 ప్రాసెస్ చేయలేదని, రూ.15 కోట్లు వసూలు కాలేదన్నారు. ఇది అధికారుల లోపాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. కార్యాలయంలో వ్యక్తిగత నగదు రిజిష్టర్‌ను నిర్వహించపోవడంతో సిబ్బంది వద్ద నగదుకు జవాబుదారీతనాన్ని ధృవీకరించడం కష్టమైందని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల హాజరు రిజిష్టరు ప్రకారం 2026 మార్చిలో కొందరు కొన్ని రోజులుగా గైర్హాజరు అయ్యారని గుర్తించారు. పూర్తి నెల జీతాలు క్లెయిమ్ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఇందనఛార్జీలు నెలకు రూ.19.33 లక్షలు క్లెయిమ్ చేశారని చెప్పారు. వాటికి సరైన రికార్డులు నిర్వహించలేదని తెలిపారు. వాహనాలకు లాగ్ బుక్ నిర్వహించడం లేదన్నారు. కేటాయించిన వాహనాలకు సరైన రికార్డులు నిర్వహించలేదన్నారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని ఏసీబీ అధికారులు తెలిపారు.

10లోగా స్వీయ గణన చేసుకోవాలి: కలెక్టర్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నీలగిరి, మే 8: '2027 జనగణనలో భాగంగా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10 వరకు మాత్రమే అవకాశం ఉంది. జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వీయ గణన చేసుకోవాలి' అని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్వీయ జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం శుక్రవారం ముఖ్య ప్రణాళిక అధికారి, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకు నిర్వహించిన జనగణన నడకను కలెక్టర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 26 నుంచి ప్రారంభమైన స్వీయ గణన ఈ నెల 10తో ముగుస్తుందన్నారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, సెన్సెస్ జాయింట్ డైరెక్టర్ రఘు, సీపీవో శ్రీనివాస్ నాయక్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, జిల్లా క్రీడలు యువజన సర్వీసుల అధికారి అక్బర్ అలీ, తహసీల్దార్ పరశురాం, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు యామ కవితారాణి, గంట్ల అనంతరెడ్డి, మహ్మద్ ఖయ్యుంబేగ్, సీహెచ్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి పద్ధతి పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఆత్మకూర్.ఎస్, మే 8 : మండల పరిధిలోని ఏపూరు రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు భూమి స్వభావం, పోషకాలు, తేమ ఎరువులు వాడడం వల్ల ఖర్చులు పెరుగుతాయని ప్రతి రైతు తన పొలానికి మట్టి నమూనాలు సేకరించి పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు, డాక్టర్లు అరుణ కుమారి, సునీత, మండల వ్యవసాయ అధికారి దివ్య, ఏపూరు గ్రామ సర్పంచ్ చంద్రమోహన్, మిడతనపల్లి సర్పంచ్ సురేశ్, వ్యవసాయ విస్తరణ అధికారి శివమూర్తి, పవన్, రైతులు పాల్గొన్నారు.

నూతనకల్‌లో..

నూతనకల్, మే 8 : రైతులు పంటల మార్పిడి పద్ధతిని అవలంబించాలని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు రజనీకాంత్, శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దిరిసనపల్లి రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్ల శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని వారు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు రజనీకాంత్, శ్రీనివాస్‌లు

కార్యక్ర మంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణకాంత్, ఉద్యాన శాఖ అధికారి ప్రమిత, గ్రామ సర్పంచ్ లింగయ్య, పెదనిమిల ఉప సర్పంచ్ నరేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల, మే 8 : రైతులు మితిమీరిన యూరియ వాడకంతో భూ సారం తగ్గుతోందని వ్యవసాయ కీటక శాస్త్రవేత్త రాములమ్మ పేర్కొన్నారు. శుక్రవారం తిమ్మారెడ్డిగూడెంలో రైతుల ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రసాయ ఎరువుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన వరి వంగడాలు, సేంద్రియ వ్యవసాయం, పంటల మార్పిడి, నానో యూరియ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రాజు, మహిత, శాస్త్రవేత్తలు హరిత, మమత, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాములమ్మ

గరిడేపల్లిలో..

గరిడేపల్లి, మే 8 : భూసార పరీక్షలకి మట్టి నమూనా సేకరణపై అవగాహన కార్యక్రమాన్ని గడ్డిపల్లి కేవీకే మృత్తిక శాస్త్రవేత్త ఏ.కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని గారకుంటతండాలో గ్రామంలో శుక్రవారం సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు నరేందర్‌నాయక్, వెంకట్రామ్, పుల్లయ్య, సైదులునాయక్ తదితరులు న్నారు.


భూ పరీక్షలకు మట్టి నమూనా సేకరిస్తున్న అధికారులు

శాంతిభద్రతలు దిగజారిపోయాయి


మాట్లాడుతున్న నవీన్‌కుమార్

నేరేడుచర్ల, మే 8 : తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు రాపోలు నవీన్ కుమార్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నచ్చని రాజకీయ పార్టీల కార్యాలయాలపై, ఇండ్లపై దాడులు చేయడం దారుణమన్నారు. బండి సంజయ్ రెచ్చగొడితే వారి కార్యకర్తలు కరీంనగర్‌లో దాడులు చేశారని పేర్కొంటూ సంజయ్ మీద కేసు నమోదు చేయాలన్నారు. దాడులతో గొంతు నొక్కాలని చూస్తే బీఆర్‌ఎస్ మరింత ధీటుగా పోరాటం చేస్తోందని ఆయన తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ


కూలీలకు మజ్జిగప్యాకెట్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునగాల, మే 8 : మండల కేంద్రంలోని గ్రామశివారులో పని చేస్తున్న 300 మంది ఉపాధి కూలీలకు శుక్రవారం బీఆర్‌ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నాయని ఉపాధి కూలీలు ఉదయం 11 గంటల వరకు పని ముగించుకొని ఇంటి వెళ్లాలని అన్నారు. పని ప్రదేశంలో టెంటు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచి నీళ్లు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వల్లోజు నర్సింహారావు, నాగబాబు, గురుమూర్తి, శ్రీను, ఫీల్డ్‌అసిస్టెంట్ కృష్ణవేణి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆశీర్వదించారు

పలు శుభకార్యాలకు హాజరైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 8 : మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జరిగిన పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని జీవీవీ ఫంక్షన్‌హాల్లో జరిగిన పబ్బ గోపి రెడ్డి సునీతల కుమార్తె వివాహ వేడుక, త్రివేణి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన రెడ్డిమల్ల శ్యామలత పరమేశ్ కుమారుడి వివాహ వేడుక, భువనగిరి జిల్లా కేంద్రంలోని సాయి కన్వెన్షన్‌లో జరిగిన గాదె జానకమ్మ శ్రీనివాస్‌రెడ్డి కుమారుడి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

తెలంగాణలో అరాచక పాలన

బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

నడిగూడెం, మే 8 : తెలంగాణ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో రాష్ట్రంలో మాజీ ఐపీఎస్ భార్య హత్యకు గురికావడం నమ్మలేని నిజమని ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువైయ్యాయని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ బంధం ఒకటేనని అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనను ప్రజలు గద్దె దించాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఇందుకు నిదర్శనం ఇటీవల కరీంనగర్‌లో జ్యూలరీ షాపులో పట్టపగలే దొంగతనం జరిగినా ఇంత వరకు దొంగలను పట్టుకోలేకపోవడం విచారణకరమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి మూటలు పంపే విషయంలో ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో శాంతిభద్రతలపై లేదని ఆరోపించారు. వరంగల్‌లో బీసీ డిక్లరేషన్ చెప్పిన విధంగా బీసీలకు కాకుండా రాష్ట్రంలో అగ్రకులాల వారికే కాంట్రాక్టులు దక్కుతున్నాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల సమన్వయ కర్త అనంతుల ఆంజనేయులు, గ్రామశాఖ అధ్యక్షుడు భువనగిరి ఉపేందర్, కాసాని ఉపేందర్, మేకల గంగరాజు, దున్న ప్రవీణ్, జలీల్, అహ్మద్, తంగేళ్ల మహేశ్, జాన్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి


మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

మేళ్లచెర్వు, మే 8 : మండల కేంద్రంలోని హను మాన్ టెంపుల్ వద్ద గురువారం బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో వెల్లటూరు గ్రామానికి చెందిన ఉపేందర్ మృతి చెందడంతో పాటు మేళ్లచెర్వుకు చెందిన మస్తాన్ తీవ్రంగా గాయపడ్డ సంగతి తెలిసిందే. కాగా మృతుడు ఉపేందర్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ పలువురు వెల్లటూరు వాసులు మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.


పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న పిల్లుట్ల రఘు

నాగేశ్వరరావు మృతి తీరని లోటు

గరిడేపల్లి, మే 8 : మండలంలోని ఉమ్మడి గ్రామ పంచాయతీ గానుగబండ మాజీ ఉప సర్పంచ్ మద్దా భాస్కర్ తండ్రి మద్దా నాగేశ్వరరావు మృతి తీరని లోటని బీఆర్‌ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్‌తో కలిసి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు,మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ వీరారెడ్డి కంభిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


గురవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రవీణ్‌కుమార్, నాయకులు

గురవయ్య కుటుంబానికి అండగా స్వేరోస్

చిలుకూరు, మే 8 : ఇటీవల మృతిచెందిన చిలుకూరుకు చెందిన స్వేరోస్ నాయకుడు గురవయ్య కుటుంబానికి స్వేరోస్ ఆధ్వర్యంలో భీమ్ హోం నిర్మించి ఇస్తామని వ్యవస్థాపకుడు బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిలుకూరులో జేజే నగర్‌లో ఇటీవల మృతిచెందిన స్వేరోస్ నాయకుడు కందుకూరి గురవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురవయ్య కుటుంబానికి స్వేరోస్ అండగా ఉంటుందని తెలిపారు. ఆటో నడుపుకుంటూ స్వేరోస్ ఉద్యమానికి పునాది వేస్తూ నిస్వార్థంగా పనిచేసిన వ్యక్తి గురవయ్య అని కొనియాడారు. అనంతరం వారి కుటుంబంతో కలిసి గురవయ్య జ్ఞాపకంగా మొక్క ను నాటి జేజే నగర్ వాసులతో కలిసి మాట్లాడారు. కార్యక్రమానికి ముందు స్వేరోస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ దుర్గయ్య, సీనియర్ నాయకులు రవి, జిల్లా అధ్యక్షులు బొల్లికొండ పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

సూర్యాపేట, మే 8 : సూర్యాపేట జిల్లా నూతన రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా పి.హాసింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలువగా నూతన అదనపు కలెక్టర్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.

అమర్‌గౌడ్ కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ


రుక్మిణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్, మే 8 : హుజూర్‌నగర్ పట్టణ బీఆర్‌ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్‌గౌడ్ మాతృమూర్తి రుక్మిణమ్మ ఇటీవల మృతి చెందడంతో శుక్రవారం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సమన్వయ కర్త ఒంటెద్దు నరసింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, జక్కుల నాగేశ్వర్‌రావు, కడియం వెంకట్‌రెడ్డి, సురేశ్, కేఎల్‌ఎన్ రెడ్డి, అప్పిరెడ్డి అంజిరెడ్డి, రాంబాబు, సైదులు, రమేశ్, అలీ, కౌన్సిలర్లు బెల్లకొండ సంధ్య, చిట్టి పోతుల భద్రమ్మ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

డీఎస్‌డీవో వెంకటరెడ్డి

కోదాడ రూరల్, మే 8 : సూర్యాపేట జిల్లా యువజన క్రీడ సర్వీసెస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడాంశాల్లో నిర్వహిస్తున్న వేసవి ఉచిత క్రీడా శిబిరాలను యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూర్యాపేట డీఎస్‌డీవో వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ బాలుర ఉన్నత పాఠశాలలోని వాలీబాల్ వేసవి ఉచిత శిక్షణ శిబిరం, కొమరబండ బాస్కెట్‌బాల్, నడిగూడెం కబడ్డీ శిబిరాలను ఆయన సందర్శించి అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో సలీం షరీఫ్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకూ నీరందించడమే లక్ష్యం : ఈఈ


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ సత్యనారాయణ

తుంగతుర్తి, మే 8 : చివరి ఆయకట్టు వరకూ రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈఈ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం తుంగతుర్తి మండలంలోని దేవునిగుట్ట తండాలో నిర్వహించిన రైతు వారం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, కాల్వల నిర్వహణపై రైతులు శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, దేవుని గుట్ట తండా సర్పంచ్ గుగులోత్ స్వాతి, వెంపటి సర్పంచ్ ఎల్లయ్య, చింతకుంట్ల వెంకన్న, పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తలసేమియాపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నేరేడుచర్ల, మే 8 : అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. రక్తంలో హిమోగ్లోబిన్ సరిగా తయారు కాకపోవడం వల్ల వచ్చే వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించాల న్నారు. అనంతరం తలసేమియా రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది స్వాతి, నర్సయ్య, పుష్ప, ఫాహిన్, నాగమణి తదిత రులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి, మే 8 : అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నరేశ్ మాట్లాడుతూ తలసేమి యా వ్యాధి సోకితే జీవితాంతం రక్తమార్పిడి చేయించుకోవాలని, వ్యాధి రాకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంజీవ, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, ఏఎన్ఎం కవిత, వెంకన్న, నర్సిరెడ్డి, మంగమ్మ, తదితరులున్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

హనుమాన్ జయంతి వేడుకలు షురూ

సూర్యాపేట, మే 8 : జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ రోడ్డులోని పురాతనమైన భక్తాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం కలశ స్థాపనతో హనుమాన్‌జయంతి ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రామానుజాచార్యులు, శ్రీధరాచార్యులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు నిర్వహించారు. హనుమ జయంతి వేడుకలను పురస్కరించుకొని మొదటి రోజు కలశస్థాపన, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, కంకణాధారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ఫౌండర్ ప్యామిలీ మెంబర్ ఆంజనేయులు మాట్లాడుతూ భక్తాంజనేయస్వామి దేవాలయంలో ఐదు రోజుల పాటు జయంతి ఉత్సవాలు నిర్వహి స్తున్నామని తెలిపారు.

ధరలు తగ్గించాలి : సీపీఐ

సూర్యాపేట, మే 8 : అదాని, అంబానీ కార్పొరేట్ ఆస్తులను కాపాడడమే లక్ష్యంగా చేసుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నరేంద్రమోదీ ఇబ్బడి ముబ్బడిగా ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతున్నాడని సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు విమర్శించారు. పెట్రోల్, డీజిల్ కొరతను నివారించి పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం డిమార్ట్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యవర్గ సభ్యులు మల్లీశ్వరి, మైనార్టీ జిల్లా నాయకులు ఎండీ పాషా, ఏఐవైఎఫ్ గౌరవాధ్యక్షులు శౌరి పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు రెన్యూవల్ చేయించుకోవాలి : తహసీల్దార్

పాలకవీడు, మే 8 : మండలంలో ఉన్న 20 రేషన్‌షాపుల డీలర్లు రెన్యూవల్ చేయించుకోవాలని తహసీల్దార్ ప్రమీల సూచించారు. శుక్రవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 31 మార్చి 2026వరకు గడువు ముగిసిందని, రెన్యూవల్ చేయించిన ఆథరైజేషన్ షాపుల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, రేషన్ షాపుల ముందు బోర్డులు ఏర్పాటు చేయాలని, సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల అధ్యక్షులు గుండా నరసింహారావు, రాములు,నరసింహ, బాలయ్య,సుందర్‌రావు, సైదయ్య, సైదిరెడ్డి,రామారావు తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ మే 8 : ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణం గోవిందపురానికి చెందిన రాయి రవి(40) శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపైన పని నిమిత్తం వెళ్తుండగా కోదాడ రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో హుజూర్‌నగర్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాల అనుమానంతో హత్య

నలుగురికి జీవిత ఖైదు

గరిడేపల్లి, మే 8 : పొనుగోడులో 2015లో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ హుజూర్‌నగర్ కోర్టు తీర్పు వెలువరించింది. గరిడేపల్లి ఎస్సై చలికంటి నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం పొనుగొడుకు చెందిన యెడిపాల వీరారెడ్డి, లింగారెడ్డి కుటుంబాల మధ్య భూ వివాదాలు కొనసాగుతున్నాయి. లింగారెడ్డి కుమారుడు అనారోగ్యానికి గురి కావడానికి వీరారెడ్డి మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో 19 జూలై 2015న వీరారెడ్డి హత్య చేసి మృతదేహాన్ని గన్ని బ్యాగులో పెట్టి పొనుగోడు రిజర్వాయర్‌లో పడేశారు. వీరారెడ్డి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులు ఎడిపాల లింగారెడ్డి, సత్యనారాయణరెడ్డి,ఉపేందర్‌రెడ్డి, సైదిరెడ్డిని అరెస్ట్ చేసి ఘటనలో ఉపయోగించిన రెండు బైకులు, ఐరన్ రాడ్లు, హాక్స్ బ్లేడ్, పార తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసులో సాక్షాదారాలను ప్రవేశపెట్టడంతో మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శివరాంప్రసాద్ నలుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.1500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 45 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది.

పంచాయతీ సమావేశాల్లో సర్పంచ్ భర్త

మాజీ సర్పంచ్ ఆరోపణ

కోదాడ రూరల్, మే 8: మండల పరిధి కూచిపూడి గ్రామ సర్పంచ్ మహిళ భర్త పంచాయతీ సమావేశాల్లో పాల్గొంటున్నారని గ్రామ మాజీ సర్పంచ్ శెట్టి సురేశ్‌నాయుడు ఆరోపించారు. శుక్రవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సర్పంచ్ భర్త పాల్గొని పాలన వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నాడని ఆరోపించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా సర్పంచ్ భర్త సమావేశం అనంతరం తన భార్యను తీసుకుని వెళ్లేందుకు మాత్రమే వచ్చాడని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ భర్త మాట్లాడుతూ గ్రామం ఒకే సామాజిక వర్గం, అందులో నాది ఒకే ఇల్లు కావడం, ప్రజల అభిమానంతో సాధించిన విజయాన్ని ఓర్వలేక తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు

జనగణన సర్వే షెడ్యూల్ విడుదల

మఠంపల్లి, మే 8 : మండలంలోని ఈ నెల 11వ తేదీ నుంచి జనగణన ఇంటింటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జగదీశ్, తహసీల్దార్ మంగా రాథోడ్ తెలిపారు. శుక్రవారం సర్వే షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామ పాలనాధికారులకు, సెక్రటరీలు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలన్నారు. ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు,జనగణన, హౌస్ లిస్టింగ్, మాపింగ్ విధులలో పూర్తి సహకారం అందించాలన్నారు.